భగవద్గీతా

ప్రథమోఽధ్యాయః

శఙ్కరభాష్యమ్ – తెలుగు అనువాదమ్

శాస్త్రకారులు:

వ్యాసులవారు

భాష్యకారులు:

శఙ్కరులవారు

అనువాదకులు:

మీనా రెంటచింతల

పరిశీలకులు:

సీతాదేవి పువ్వాడ

సత్యలక్ష్మి బొర్రా

లలితా ఊలపల్లి

నైమిశారణ్యమ్

జనవరి 2026

ప్రథమోఽధ్యాయః

నారాయణః పరోఽవ్యక్తాదణ్డమవ్యక్తసమ్భవమ్ ।
అణ్డస్యాన్తస్త్విమే లోకాః సప్తద్వీపా చ మేదినీ ॥

నారాయణః పరః అవ్యక్తాత్ అణ్డం అవ్యక్తసమ్భవం అణ్డస్యా అన్తః తు ఇమే లోకాః సప్తద్వీపా చ మేదినీ

నారాయణః = నారాయణుడు; అవ్యక్తాత్ = అవ్యక్తం కన్నా; పరః = పరుడు; అవ్యక్తసమ్భవం = అవ్యక్తం నుండి సంభవించినది; అణ్డం = అణ్డం (బ్రహ్మాణ్డం); అణ్డస్య = అణ్డం యొక్క; అన్తః తు = లోపలే; ఇమే = ఈ; లోకాః = లోకాలు (ఉన్నాయి); సప్తద్వీపా = సప్తద్వీపాలతో ఉన్న; మేదినీ = భూమి; చ = కూడా (ఉన్నది).

పరుడైన నారాయణుడి నుండి అవ్యక్తం సంభవించింది. అవ్యక్తం నుండి అణ్డం (బ్రహ్మాండం) వచ్చింది. దానిలోపలే సప్తద్వీపాలతో కూడిన భూమితో సహా లోకాలన్నీ ఉన్నాయి.

స భగవాన్ సృష్ట్వా ఇదం జగత్ తస్య చ స్థితిం చికీర్షుః మరీచ్యాదీన్ అగ్రే సృష్ట్వా ప్రజాపతీన్ ప్రవృత్తి–లక్షణం ధర్మం గ్రాహయామాస వేదోక్తమ్।

తతః అన్యాన్ చ సనకసనన్దనాదీన్ ఉత్పాద్య నివృ–త్తిలక్షణం ధర్మం జ్ఞానవైరాగ్యలక్షణం గ్రాహయామాస।

ద్వివిధో హి వేదోక్తో ధర్మః ప్రవృత్తిలక్షణో నివృత్తి–లక్షణః చ।

జగతః స్థితికారణం ప్రాణినాం సాక్షాత్ అభ్యుదయ–నిఃశ్రేయసహేతుః యః స ధర్మో బ్రాహ్మణాద్యైః వర్ణిభిః ఆశ్రమిభిః చ శ్రేయః అర్థిభిః అనుష్ఠీయమానః।

దీర్ఘేణ కాలేన అనుష్ఠాతౄణాం కామోద్భవాత్ హీయమానవివేకజ్ఞానహేతుకేన అధర్మేణ అభిభూయ–మానే ధర్మే ప్రవర్ధమానే చ అధర్మే జగతః స్థితిం పరిపి–పాలయిషుః స ఆదికర్తా నారాయణాఖ్యో విష్ణుః భౌమస్య బ్రహ్మణో బ్రాహ్మణత్వస్య రక్షణార్థం దేవక్యాం వసుదే–వాత్ అంశేన కృష్ణః కిల సంబభూవ।

భగవంతుడు ఈ జగత్తును సృష్టించి దాని స్థితిని చేయాలని కోరుకున్నవాడై ముందు మరీచి మొదలైన ప్రజాపతులను సృష్టించి వారికి ప్రవృత్తి లక్షణమైన వైదికధర్మాన్ని గ్రహింపచేసాడు.

తర్వాత సనకుడు సనందనుడు మొదలైనవారిని ఉత్పత్తి చేసి వారికి నివృత్తిలక్షణమైన జ్ఞానవైరాగ్యలక్షణమైన ధర్మాన్ని గ్రహింపచేసాడు.

వేదోక్తధర్మం ప్రవృత్తిలక్షణం, నివృత్తిలక్షణం అని రెండు విధాలుగా ఉంటుంది.

జగత్తులోని ప్రాణుల స్థితికారకమైనది, సాక్షాత్తుగా అభ్యుదయ–నిఃశ్రేయసకారణమైనదై ఉన్న ఏ ధర్మం ఉన్నదో అది శ్రేయస్సు కోరుకునే బ్రాహ్మణాది వర్ణాలచేత, బ్రహ్మచర్యాది ఆశ్రమాలచేత ఆచరింపవలసి ఉన్నది.

అయితే చాలాకాలం గడిచేసరికి ఈ ధర్మాలను ఆచరించేవారిలో కోరికలు కలగడం వల్ల, వివేకవిజ్ఞానం నశిస్తూ ఉండడం చేత, అధర్మం పెరిగిపోతూ ఉండడం చేత, సన్నగిల్లిపోతూ ఉన్న ధర్మాన్ని మళ్ళీ వృద్ధి చేయడం ద్వారా అధర్మంలో ఉన్న జగత్తును కాపాడాలన్న కోరికతో ఆ ఆదికర్త నారాయణుడు అన్న పేరుతో విష్ణువు భూమిపైన బ్రహ్మ యొక్క బ్రాహ్మణత్వాన్ని రక్షించడం కోసం దేవకి యందు వసుదేవుడి అంశతో కృష్ణుడిగా సంభవించాడు.

బ్రాహ్మణత్వస్య హి రక్షణే రక్షితః స్యాత్ వైదికో ధర్మః తత్ అధీనత్వాత్ వర్ణాశ్రమభేదానామ్।

స చ భగవాన్ జ్ఞానైశ్వర్యశక్తిబలవీర్యతేజోభిః సదా సమ్పన్నః త్రిగుణాత్మికాం స్వాం మాయాం మూలప్రకృతిం వశీకృత్య అజః అవ్యయో భూతానామ్ ఈశ్వరో నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావః అపి సన్ స్వమాయయా దేహవాన్ ఇవ జాత ఇవ చ లోకానుగ్రహం కుర్వన్ లక్ష్యతే।

బ్రాహ్మణత్వాన్ని (బ్రహ్మమార్గంలో చరించడాన్ని) రక్షించడం ద్వారా మాత్రమే వైదికధర్మాలు రక్షించబడతాయి. దానిద్వారా దాని అధీనంలో ఉన్న వర్ణాశ్రమభేదాలు రక్షింపబడతాయి.

జ్ఞానం, ఐశ్వర్యం, శక్తి, బలం, వీర్యం, తేజస్సులతో ఎల్లప్పుడు సంపన్నమై ఉన్న ఆ భగవంతుడు త్రిగుణాత్మకం మూలప్రకృతి అయిన తన మాయను తన వశంలో ఉంచుకుని, ఆ అజుడు, అవ్యయుడు, భూతాలకు ఈశ్వరుడు, నిత్యమూ శుద్ధమై, బుద్ధమై, ముక్తమై ఉండడం అన్న స్వభావం కలిగినవాడై ఉండి కూడా తన మాయతో దేహాలు ధరించినవాడిలాగా, జన్మతీసుకున్నవాడిలాగా లోకాలను (ప్రాణులను) అనుగ్రహించడం కోసం తెలియబడుతూ ఉంటాడు.

(శుద్ధమనగా రెండవది లేని పరిపూర్ణస్థితి. బుద్ధమనగా స్వరూపజ్ఞానం. ముక్తమనగా అవిద్యాకల్పితకర్మరాహిత్యం. అద్వైతజ్ఞానమే మోక్షం.)

స్వప్రయోజనాభావే అపి భూతానుజిఘృక్షయా వైదికం హి ధర్మద్వయం అర్జునాయ శోకమోహమహోదధౌ నిమగ్నాయ ఉపదిదేశ గుణాధికైః హి గృహీతః అనుష్ఠీయమానః చ ధర్మః ప్రచయం గమిష్యతి ఇతి।

తనకు ఏ ప్రయోజనం లేకపోయినా కూడా ప్రాణులను అనుగ్రహించాలన్న ఇచ్ఛతో గుణాధికులు ఆచరించడం వల్ల ధర్మం మళ్ళీ విస్తరిస్తుందన్న ఆలోచనతో శోకమోహాలన్న మహాసముద్రంలో మునిగిపోయి ఉన్న అర్జునుడికి వేదోక్తమైన (ప్రవృత్తినివృత్తిలక్షణాలతో ఉన్న) ఈ రెండు ధర్మాలను ఉపదేశించారు.

తం ధర్మం భగవతా యథోపదిష్టం వేదవ్యాసః సర్వజ్ఞః భగవాన్ గీతాఖ్యైః సప్తభిః శ్లోకశతైః ఉపనిబబన్ధ।

భగవంతుడి చేత ఏ విధంగా ఉపదేశించబడిందో (అదే విధంగా) దాన్ని సర్వజ్ఞుడైన వేదవ్యాసభగవానుడు భగవద్గీత అన్న పేరుతో ఏడు వందల శ్లోకాల్లో పొందుపరిచారు.

తత్ ఇదం గీతాశాస్త్రం సమస్తవేదార్థసారసఙ్గ్రహభూతం దుర్విజ్ఞేయార్థమ్।

ఆ ఈ గీతాశాస్త్రం సమస్తవేదాల, వేదార్థాల యొక్క సారసంగ్రహరూపం. (అందుకని) అది అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉంటుంది.

తత్ అర్థావిష్కరణాయ అనేకైః వివృతపదపదార్థవాక్యార్థన్యాయమ్ అపి అత్యన్తవిరుద్ధానేకార్థత్వేన లౌకికైః గృహ్యమాణమ్ ఉపలభ్య అహం వివేకతః అర్థనిర్ధారణార్థం సంక్షేపతో వివరణం కరిష్యామి।

దాని అర్థాన్ని ఆవిష్కరించడం కోసం ఎంతో మంది చేత పదాలు, పదార్థాలు, వాక్యార్థాలు న్యాయంగానే వివరించబడుతూ ఉన్నా కూడా, అత్యంత విరుద్ధమైన అనేకమైన అర్థాలు లోకుల చేత గ్రహింపబడుతూ ఉన్నందువల్ల నేను వివేకంతో అర్థనిర్ధారణ చేయడం కోసం సంక్షేపంగా వివరిస్తాను.

తస్య అస్య గీతాశాస్త్రస్య సంక్షేపతః ప్రయోజనం పరం నిఃశ్రేయసం సహేతుకస్య సంసారస్య అత్యన్తోపరమలక్షణమ్। తత్ చ సర్వకర్మసన్న్యాసపూర్వకాత్ ఆత్మజ్ఞాననిష్ఠారూపాత్ ధర్మాత్ భవతి।

సంక్షేపంగా ఈ గీతాశాస్త్రం యొక్క ప్రయోజనం సహేతుకంగా సంపూర్ణంగా సంసారం ఉపశమించడం అన్న పరమనిఃశ్రేయసమే. అది సర్వకర్మసన్న్యాసపూర్వకమైన ఆత్మజ్ఞాననిష్ఠారూపమైన ధర్మం వల్లే కలుగుతుంది.

తథా ఇమమ్ ఏవ గీతార్థధర్మం ఉద్దిశ్య భగవతా ఏవ ఉక్తం *'స హి ధర్మః సుపర్యాప్తో బ్రహ్మణః పదవేదనే'.* తత్ర ఏవ చ ఉక్తం *నైవ ధర్మీ న చాధర్మీ న చైవ హి శుభాశుభీ। యః స్యాదేకాయనే లీనస్తూష్ణీం కించిదచిన్తయన్'* ఇతి *'జ్ఞానం సన్న్యాసలక్షణమ్'* ఇతి చ।

ఇహ అపి చ అన్తే ఉక్తం అర్జునాయ *'సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'* (గీ18.66) ఇతి।

అభ్యుదయార్థః అపి యః ప్రవృత్తిలక్షణో ధర్మో వర్ణాన్ ఆశ్రమాన్ చ ఉద్దిశ్య విహితః స దేవాదిస్థానప్రాప్తిహేతుః అపి సన్ ఈశ్వరార్పణబుద్ధ్యా అనుష్ఠీయమానః సత్త్వశుద్ధయే భవతి ఫలాభిసన్ధివర్జితః। శుద్ధసత్త్వస్య చ జ్ఞాననిష్ఠాయోగ్యతాప్రాప్తిద్వారేణ జ్ఞానోత్పత్తిహేతుత్వేన చ నిఃశ్రేయసహేతుత్వమ్ అపి ప్రతిపద్యతే। తథా చ ఇమమ్ ఏవ అర్థమ్ అభిసన్ధాయ వక్ష్యతి *'బ్రహ్మణ్యాధాయ కర్మాణి'* (గీ5.10), *'యోగినః కర్మ కుర్వన్తి సఙ్గం త్యక్త్వాత్మశుద్ధయే'* (గీ5.11) ఇతి।

ఇమం ద్విప్రకారం ధర్మం నిఃశ్రేయసప్రయోజనం పరమార్థతత్త్వం చ వాసుదేవాఖ్యం పరం బ్రహ్మ అభిధేయభూతం విశేషతః అభివ్యఞ్జయత్ విశిష్టప్రయోజనసమ్బన్ధాభిధేయవత్ గీతాశాస్త్రమ్।

అలాగే ఈ గీతాధర్మాన్ని ఉద్దేశించి భగవంతుడిచేత అనుగీతలో కూడా 'వేదవాక్యాలను అర్థం చేసుకోవడానికి ఈ ధర్మమే చాలు' అని చెప్పబడింది. అక్కడే 'ఎవరైతే ఏకస్థితిలో లీనమై మౌనంగా ఏ ఆలోచనా లేకుండా ఉంటాడో (అటువంటివాడు) ధర్మీ కాదు, అధర్మీ కాదు, శుభాశుభీ కాదు' అని 'సన్న్యాసలక్షణమైన జ్ఞానం' అని చెప్పబడింది.

ఇక్కడ కూడా అర్జునుడికి చివరగా 'ధర్మాలన్నింటినీ వదిలిపెట్టి నన్ను ఒక్కడ్నే శరణు పొందు' అని చెప్పారు.

వర్ణాశ్రమాలను ఉద్దేశించి (ఆచరించేవారి) అభ్యుదయం కోసం ఏ ప్రవృత్తిలక్షణమైన ధర్మం చెప్పబడిందో, అది (కోరికలతో ఆచరించేవారికి) ఆయా దేవతాలోకాలను పొందేందుకు హేతువైనాకుడా, ప్రతిఫలాపేక్షలేకుండా ఈశ్వరార్పణబుద్ధితో ఆచరిస్తే సత్త్వశుద్ధికి మార్గం అవుతుంది. శుద్ధసత్త్వంతో ఉన్నవారికి జ్ఞాననిష్ఠకు యోగ్యత కలగడం ద్వారా జ్ఞానోత్పత్తి కలిగి, దాని ద్వారా నిఃశ్రేయసానికి (మోక్షానికి) కూడా మార్గం ప్రాప్తిస్తుంది. ఈ ప్రయోజనాన్ని ఉద్దేశించి 'బ్రహ్మ యందు సమర్పించి కర్మలను', 'యోగులు సంగం వదిలిపెట్టి చిత్తశుద్ధికోసమే కర్మలు చేస్తుంటారు' అని చెప్పబోతున్నారు.

ఈ గీతాశాస్త్రానికి ప్రయోజనం నిఃశ్రేయసం అనగా మోక్షమే. (దాన్ని సాధించేందుకు మార్గంగా అధికారభేదాన్ని బట్టి జ్ఞానాధికారులకు జ్ఞాననిష్ఠగా, కర్మాధికారులకు కర్మనిష్ఠ నుండి జ్ఞాననిష్ఠగా) రెండు ప్రకారాలుగా ఉన్న ధర్మంగా ఉపదేశించబడింది. ఈ శాస్త్రం వాసుదేవం అన్న పేరుతో పరబ్రహ్మ అని చెప్పబడే పరమార్థతత్త్వాన్ని విశేషంగా ప్రతిపాదిస్తూ ఉన్నది. ఈ గీతాశాస్త్రం విశిష్టప్రయోజనం, సంబంధం, అభిధేయాలతో కూడి ఉంటుంది.

(ప్రయోజనం అనగా కోరుకోబడే ఫలం నిఃశ్రేయసం. అభిధేయం అనగా దాని విషయం పరబ్రహ్మ. సంబంధం అనగా దేని ద్వారా ఆ ఫలాన్ని సాధించగలమో ఆ ధర్మం.

ఈ శాస్త్రంలో పరబ్రహ్మను విషయంగా చేసుకుని చెప్పబడ్డ ధర్మాన్ని ఆచరించడం ద్వారా మోక్షమన్న ఫలాన్ని పొందవచ్చు.)

యతః తత్ అర్థే విజ్ఞాతే సమస్తపురుషార్థసిద్ధిః అతః తత్ వివరణే యత్నః క్రియతే మయా॥	ఏదైతే ఈ పరమార్థం తెలుసుకుంటే సమస్తపురుషార్థసిద్ధి కలుగుతుందో, అటువంటి దీని వివరణకు నాచేత ప్రయత్నం చేయబడుతున్నది.

ధృతరాష్ట్ర ఉవాచ ।

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।

మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥1॥

ధృతరాష్ట్రః ఉవాచ ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతాః యుయుత్సవః మామకాః పాణ్డవాః చ ఏవ కిం అకుర్వత సంజయ

ధృతరాష్ట్రః = ధృతరాష్ట్రుడు; ఉవాచ = అన్నాడు; సంజయ = ఓ సంజయ; ధర్మక్షేత్రే = ధర్మక్షేత్రమైన; కురుక్షేత్రే = కురుక్షేత్రంలో; యుయుత్సవః = యుద్ధం చేయాలన్న కోరికతో ఉన్నవాళ్ళు; మామకాః = నా వాళ్ళు; ఏవ చ = అలాగే; పాణ్డవాః = పాణ్డవులు; సమవేతాః = సమావేశమయ్యారు; కిం = ఏమి; అకుర్వత = చేసారు.

ధృతరాష్ట్రుడు సంజయుడిని ఈ విధంగా అడిగాడు, 'సంజయ, నావాళ్ళు, పాణ్డురాజు వైపు వాళ్ళు ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో యుద్ధం చేయాలన్న కోరికతో కలిసారుకదా? అప్పుడు వాళ్ళు ఏం చేసారు?'

*యుయుత్సా = యోద్ధుం ఇచ్ఛా; యుద్ధం చేయాలన్న కోరిక.

సంజయ ఉవాచ ।

దృష్ట్వా తు పాణ్డవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।

ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥2॥

సంజయః ఉవాచ దృష్ట్వా తు పాణ్డవానీకం వ్యూఢం దుర్యోధనః తదా ఆచార్యం ఉపసంగమ్య రాజా వచనం అబ్రవీత్

సంజయః = సంజయుడు; ఉవాచ = చెప్పాడు; రాజా = రాజు; దుర్యోధనః = దుర్యోధనుడు; తు = మరి; తదా = అప్పుడు; పాణ్డవానీకం = (పాణ్డవ అనీకం) పాణ్డవసైన్యం; వ్యూఢం = వ్యూహం; దృష్ట్వా = చూసి; ఆచార్యం = ఆచార్యుడిని; ఉపసంగమ్య = సమీపించి; వచనం = (ఈ) మాటను; అబ్రవీత్ = అన్నాడు.

సంజయుడు ధృతరాష్ట్రుడికి ఈ విధంగా జవాబు చెప్పాడు, 'రాజు దుర్యోధనుడు పాణ్డవసైన్యం ఒక వ్యూహంగా నిలబడి ఉండగా దాన్ని చూసి ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్ళి ఈ విధంగా అన్నాడు.'

పశ్యైతాం పాణ్డుపుత్రాణామాచార్య మహతీం చమూమ్ ।

వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥3॥

పశ్య ఏతాం పాణ్డుపుత్రాణాం ఆచార్య మహతీం చమూం వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా

ఆచార్య = ఓ ఆచార్య; తవ = నీ; శిష్యేణ = శిష్యుడైన; ధీమతా = (యుద్ధం గురించిన) జ్ఞానకలిగిన; ద్రుపదపుత్రేణ = ద్రుపదపుత్రుడైన ధృష్టద్యుమ్నుడి చేత; వ్యూఢాం = వ్యూహంగా ఏర్పరచబడ్డ; ఏతాం = ఈ; పాణ్డుపుత్రాణాం = పాణ్డుపుత్రుల; మహతీం = గొప్ప; చమూం = సైన్యాన్ని; పశ్య = చూడు.

ఆచార్య, యుద్ధనైపుణ్యం కలిగిన మీ శిష్యుడు ధృష్టద్యుమ్నుడి చేత వ్యూహంగా నిలబెట్టబడ్డ పాణ్డవుల ఈ గొప్ప సైన్యాన్ని చూడండి.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥4॥
ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ ।
పురుజిత్కున్తిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥5॥
యుధామన్యుశ్చ విక్రాన్త ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥6॥

అత్ర శూరాః మహేష్వాసాః భీమార్జునసమాః యుధి యుయుధానః విరాటః చ ద్రుపదః చ మహారథః ధృష్టకేతుః చేకితానః కాశిరాజః చ వీర్యవాన్ పురుజిత్ కున్తిభోజః చ శైబ్యః చ నరపుంగవః యుధామన్యుః చ విక్రాన్తః ఉత్తమౌజాః చ వీర్యవాన్ సౌభద్రః ద్రౌపదేయాః చ సర్వే ఏవ మహారథాః

అత్ర = ఇక్కడ; శూరాః = శూరులు; మహేష్వాసాః = గొప్ప ధనుర్ధారులు; యుధి = యుద్ధంలో; భీమార్జునసమాః = భీముడికి, అర్జునుడికి సమానమైనవాళ్ళు; యుయుధానః = యుయుధానుడు; విరాటః = విరాటరాజు; చ = మరియు; ద్రుపదః = ద్రుపదుడు; చ = మరియు; మహారథః = మహారథుడైన; ధృష్టకేతుః = ధృష్టకేతుడు; చేకితానః = చేకితానుడు; వీర్యవాన్ = వీర్యవంతుడైన; కాశిరాజః = కాశిరాజు; చ = మరియు; పురుజిత్ = పురుజిత్తు; కున్తిభోజః = కున్తిభోజుడు; చ = మరియు; నరపుంగవః = నరశ్రేష్ఠుడు; శైబ్యః = శైబ్యుడు; చ = మరియు; యుధామన్యుః = యుధామన్యుడు; చ = మరియు; విక్రాన్తః = విక్రాంతుడు; వీర్యవాన్ = వీర్యవంతుడు; ఉత్తమౌజాః = ఉత్తమౌజుడు; చ = మరియు; సౌభద్రః = సుభద్రా పుత్రుడైన అభిమన్యుడు; ద్రౌపదేయాః = ద్రౌపదేయులు; సర్వే ఏవ చ = అందరూ కూడా; మహారథాః = మహారథులే.

పాణ్డవసైన్యంలో అందరూ గొప్ప శూరులు, ధనుర్విద్య తెలిసినవాళ్ళు, యుద్ధంలో భీముడికి, అర్జునుడికి సమానమైనవాళ్ళు. యుయుధానుడు, విరాటరాజు, ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశిరాజు, పురుజిత్తు, కున్తిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, విక్రాంతుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, అలాగే ద్రౌపదీ పుత్రులు అందరూ కూడా మహారథులే.

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్బ్రవీమి తే ॥7॥

అస్మాకం తు విశిష్టాః యే తాన్ నిబోధ ద్విజోత్తమ నాయకాః మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే

ద్విజోత్తమ = ఓ ద్విజోత్తమ, అస్మాకం తు = మనవాళ్ళు మరి; యే = ఎవరు; విశిష్టాః = విశిష్టమైనవాళ్ళు; మమ = నా; సైన్యస్య = సైన్యం యొక్క; నాయకాః = నాయకులు (ఉన్నారో); తాన్ = వారిని; సంజ్ఞార్థం = గుర్తుకోసం; తే = నీకు; బ్రవీమి = చెప్తాను; తాన్ = వారిని; నిబోధ = తెలుసుకో.

ఆచార్య, నావైపు విశేషమైనవాళ్ళు, నా సైన్యానికి నాయకులు ఎవరో గుర్తుకోసం చెప్తాను వినండి.

భవాన్భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిర్జయద్రథః ॥8॥
అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥9॥

భవాన్ భీష్మః చ కర్ణః చ కృపః చ సమితింజయః అశ్వత్థామా వికర్ణః చ సౌమదత్తిః జయద్రథః అన్యే చ బహవః శూరాః మత్ అర్థే త్యక్తజీవితాః నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః

భవాన్ = మీరు; భీష్మః = భీష్ముడు; చ = మరియు; కర్ణః = కర్ణుడు; చ = మరియు; కృపః = కృపుడు; చ = మరియు; సమితింజయః = సమితింజయుడు; అశ్వత్థామా = అశ్వత్థామ; వికర్ణః = వికర్ణుడు; చ = మరియు; సౌమదత్తిః = సోమదత్తుడి పుత్రుడు భూరిశ్రవసుడు; జయద్రథః = జయద్రథుడు; అన్యే చ = మిగిలినవాళ్ళు; బహవః = ఎందరో; శూరాః = శూరులు; మత్ = నా; అర్థే = ప్రయోజనం కోసం; త్యక్తజీవితాః = జీవితంపైన ఆశలువదిలిపెట్టినవాళ్ళు; నానాశస్త్రప్రహరణాః = అనేకరకాల ప్రహరణాయుధాలతో ఉన్న వాళ్ళు; సర్వే = అందరూ; యుద్ధవిశారదాః = యుద్ధంలో వైశారద్యం కలిగినవాళ్ళు.

నావైపు మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపుడు, సమితింజయుడు, అశ్వత్థామ, వికర్ణుడు, భూరిశ్రవసుడు, జయద్రథుడు ఉన్నారు. ఇంతే కాదు, జీవితంపైన ఆశలువదిలిపెట్టి నాకోసం చావడానికి సిద్ధపడి ఈ యుద్ధానికి వచ్చినవాళ్ళు ఇంకా ఎందరో ఉన్నారు. అందరూ కూడా యుద్ధంలో గొప్ప నేర్పు కలిగినవాళ్ళే.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥10॥

అపర్యాప్తం తత్ అస్మాకం బలం భీష్మాభిరక్షితం పర్యాప్తం తు ఇదం ఏతేషాం బలం భీమాభిరక్షితం

భీష్మాభిరక్షితం = (భీష్మ అభిరక్షితం) భీష్ముడి చేత రక్షింపబడుతున్న; అస్మాకం = మా; తత్ = ఆ; బలం = సైన్యం; అపర్యాప్తం = పరిమితి లేనిది; తు = కానీ; భీమాభిరక్షితం = (భీమ అభిరక్షితం) భీముడి చేత రక్షింపబడుతున్న; ఏతేషాం = వీరి; ఇదం = ఈ; బలం = సైన్యం; పర్యాప్తం = పరిమితమైనది.

భీష్ముడి రక్షణలో ఉన్న నా సైన్యం అపరిమితంగా ఉన్నది. భీముడి రక్షణలో ఉన్న వీరి సైన్యం మాత్రం పరిమితంగా ఉన్నది.

అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।
భీష్మమేవాభిరక్షన్తు భవన్తః సర్వ ఏవ హి ॥11॥

అయనేషు చ సర్వేషు యథాభాగం అవస్థితాః భీష్మం ఏవ అభిరక్షన్తు భవన్తః సర్వే ఏవ హి

భవన్తః = మీరు; సర్వే ఏవ చ = అందరూ కూడా; సర్వేషు = అన్ని: అయనేషు = (వ్యూహ)స్థానాల్లో; యథాభాగమవస్థితాః = మీమీభాగాల్లో నిలుచున్నవారై; భీష్మం ఏవ హి = భీష్ముడ్నే; అభిరక్షన్తు = కాపాడుతూ ఉండండి.

మీరందరూ కూడా మీకు కేటాయించిన వ్యూహస్థానాల్లో నిలబడి భీష్ముడ్ని కాపాడుతూ ఉండండి.

తస్య సంజనయన్హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥12॥

తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః సింహనాదం వినద్య ఉచ్చైః శఙ్ఖం దధ్మౌ ప్రతాపవాన్

కురువృద్ధః = కురువృద్ధుడు; పితామహః = పితామహుడు; ప్రతాపవాన్ = ప్రతాపవంతుడు; తస్య = ఆయనకు; హర్షం = హర్షం; సంజనయన్ = కలిగిస్తూ; ఉచ్చైః = పెద్దగా; సింహనాదం = సింహనాదం; వినద్య = వినిపించి; శఙ్ఖం = శఙ్ఖం; దధ్మౌ = మ్రోగించాడు.

అప్పుడు భీష్ముడు దుర్యోధనుడికి ఉత్సాహం కలిగిస్తూ పెద్దగా సింహనాదం చేసి యుద్ధం మొదలవ్వడానికి సూచనగా శఙ్ఖాన్ని మ్రోగించాడు.

తతః శఙ్ఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।
సహసైవాభ్యహన్యన్త స శబ్దస్తుములోఽభవత్ ॥13॥

తతః శఙ్ఖాః చ భేర్యః చ పణవానకగోముఖాః సహసా ఏవ అభ్యహన్యన్త సః శబ్దః తుములః అభవత్

తతః = అప్పుడు; సహసా ఏవ = వెంటనే; శఙ్ఖాః = శఙ్ఖాలు; చ = మరియు; భేర్యః = భేరీలు; చ = మరియు; పణవానకగోముఖాః = (పణవ ఆనక గోముఖాః) తప్పెట్లు, మద్దెళ్ళు, కొమ్ము బూరలు (బాకాలు); అభ్యహన్యన్త = మారుమ్రోగాయి; సః = ఆ; శబ్దః = శబ్దం; తుములః = భయంకరంగా; అభవత్ = కలిగింది.

వెంటనే రకరకాల శఙ్ఖాలు, భేరీలు, బాకాలు, తప్పెట్లు, మద్దెళ్ళు అన్ని వైపులా ఒక్కసారిగా మ్రోగాయి. ఆ శబ్దం అతి భయంకరంగా ఉన్నది.

తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యన్దనే స్థితౌ ।
మాధవః పాణ్డవశ్చైవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః ॥14॥
పాఞ్చజన్యం హృషీకేశో దేవదత్తం ధనఞ్జయః ।
పౌణ్డ్రం దధ్మౌ మహాశఙ్ఖం భీమకర్మా వృకోదరః ॥15॥
అనన్తవిజయం రాజా కున్తీపుత్రో యుధిష్ఠిరః ।
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥16॥
కాశ్యశ్చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః ।
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥17॥
ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహుః శఙ్ఖాన్దధ్ముః పృథక్పృథక్ ॥18॥

తతః శ్వేతైః హయైః యుక్తే మహతి స్యన్దనే స్థితౌ మాధవః పాణ్డవః చ ఏవ దివ్యౌ శఙ్ఖౌ ప్రదధ్మతుః పాఞ్చజన్యం హృషీకేశః దేవదత్తం ధనఞ్జయః పౌణ్డ్రం దధ్మౌ మహాశఙ్ఖం భీమకర్మా వృకోదరః అనన్తవిజయం రాజా కున్తీపుత్రః

యుధిష్ఠిరః నకులః సహదేవః చ సుఘోషమణిపుష్పకౌ కాశ్యః చ పరమేష్వాసః శిఖణ్డీ చ మహారథః ధృష్టద్యుమ్నః విరాటః చ సాత్యకిః చ అపరాజితః ద్రుపదః ద్రౌపదేయాః చ సర్వశః పృథివీపతే సౌభద్రః చ మహాబాహుః శఙ్ఖాన్ దధ్ముః పృథక్ పృథక్

పృథివీపతే = ఓ పృథివీపతి; తతః = అప్పుడు; శ్వేతైః = తెల్లని; హయైః = గుర్రాలతో; యుక్తే = కుడిన; మహతి = పెద్ద; స్యన్దనే = రథంలో; స్థితౌ = ఉన్న; మాధవః = మాధవుడు; పాణ్డవః చ ఏవ = అర్జునుడు కూడా; దివ్యౌ = దివ్యమైన; శఙ్ఖౌ = శఙ్ఖాలను; ప్రదధ్మతుః = మ్రోగించారు; హృషీకేశః = హృషీకేశుడు; పాఞ్చజన్యం = పాఞ్చజన్యాన్ని; ధనఞ్జయః = ధనంజయుడు; దేవదత్తం = దేవదత్తాన్ని; భీమకర్మా = భయంకరమైన కర్మలు చేసే; వృకోదరః = వృకోదరుడు; పౌణ్డ్రం = పౌణ్డ్రం అన్న; మహాశఙ్ఖం = మహాశఙ్ఖాన్ని; దధ్మౌ = మ్రోగించారు; రాజా = రాజు; కున్తీపుత్రః = కున్తీపుత్రుడు; యుధిష్ఠిరః = యుధిష్ఠిరుడు; అనన్తవిజయం = అనన్తవిజయాన్ని; నకులః = నకులుడు; చ = మరియు; సహదేవః = సహదేవుడు; సుఘోషమణిపుష్పకౌ = సుఘోషం, మణిపుష్పకాన్ని; పరమేష్వాసః = గొప్పధనుష్మంతుడు; కాశ్యః = కాశీరాజు; చ = మరియు; మహారథః = మహారథుడు; శిఖణ్డీ = శిఖణ్డీ; చ = మరియు; ధృష్టద్యుమ్నః = ధృష్టధ్యుమ్నుడు; చ = మరియు; విరాటః = విరాటరాజు; అపరాజితః = అపజయం లేనివాడు; సాత్యకిః = సాత్యకి; చ = మరియు; ద్రుపదః = ద్రుపదుడు; ద్రౌపదేయాః = ద్రౌపదీ పుత్రులు; చ = మరియు; మహాబాహుః = పరాక్రమవంతుడు; సౌభద్రః = సుభద్రాపుత్రుడు అభిమన్యుడు; చ = మరియు; సర్వశః = అన్నివైపులనుండి; పృథక్ = వేరు; పృథక్ = వేరుగా; శఙ్ఖాన్ = శఙ్ఖాలను; దధ్ముః = మ్రోగించారు.

రాజా, అప్పుడు తెల్లని గుర్రాలు పూన్చిన పెద్ద రథంలో ఉన్న కృష్ణుడు, అర్జునుడు కూడా తమ తమ దివ్యమైన శఙ్ఖాలను మ్రోగించారు. కృష్ణుడు పాఞ్చజన్యాన్ని, అర్జునుడు దేవదత్తాన్ని, భీముడు పౌణ్డ్రం అన్న మహాశఙ్ఖాన్ని, యుధిష్ఠిరుడు అనన్తవిజయాన్ని, నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్ని మ్రోగించారు. అలాగే కాశీరాజు, శిఖణ్డీ, ధృష్టధ్యుమ్నుడు, విరాటరాజు, సాత్యకి, ద్రుపదుడు, ద్రౌపదీ పుత్రులు, అభిమన్యుడు కూడా అన్నివైపులనుండి వేరు వేరుగా తమ తమ శఙ్ఖాలను పూరించారు.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥19॥

స ఘోషః ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ నభః చ పృథివీం చ ఏవ తుములః వ్యనునాదయన్

సః = ఆ; ఘోషః = మహానాదం; నభః = ఆకాశాన్ని; చ = మరియు; పృథివీం చ ఏవ = భూమిని కూడా (నింపుతూ); తుములః = భయంకరంగా; వ్యనునాదయన్ = ప్రతిధ్వనిస్తూ; ధార్తరాష్ట్రాణాం = ధార్తరాష్ట్రుల; హృదయాని = హృదయాలను; వ్యదారయత్ = బ్రద్దలు చేసింది.

ఆ మహానాదం భూమ్యాకాశాలు నిండి భయంకరంగా ప్రతిధ్వనిస్తూ దుర్యోధనాదుల గుండెలు పగిలేలా చేసింది.

అథ వ్యవస్థితాన్దృష్ట్వా ధార్తరాష్ట్రాన్కపిధ్వజః ।
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాణ్డవః ॥20॥
హృషీకేశం తదా వాక్యమిదమాహ మహీపతే ।

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ప్రవృత్తే శస్త్రసంపాతే ధనుః ఉద్యమ్య పాణ్డవః హృషీకేశం తదా వాక్యం ఇదం ఆహ మహీపతే ।

మహీపతే = ఓ మహీపతి; అథ = ఇక; శస్త్రసంపాతే = యుద్ధం; ప్రవృత్తే = ప్రారంభం కాబోతూ ఉండగా; ధనుః = ధనుస్సును; ఉద్యమ్య = ఎత్తి పట్టుకుని; కపిధ్వజః = కపిధ్వజం కలిగినవాడు; పాణ్డవః = అర్జునుడు; వ్యవస్థితాన్ = యుద్ధానికి సిద్ధమై నిలబడి ఉన్న; ధార్తరాష్ట్రాన్ = ధార్తరాష్ట్రులను; దృష్ట్వా = చూసి; తదా = అప్పుడు; హృషీకేశం = కృష్ణుడితో; ఇదం = ఈ; వాక్యం = మాటను; ఆహ = అన్నాడు.

సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్తున్నాడు, 'రాజా, యుద్ధం ప్రారంభం అవ్వబోతూ ఉండగా అర్జునుడు తన ధనుస్సుకు బాణం ఎక్కుపెట్టి వదలడానికి సిద్ధపడుతూ ఎదురుగా నిలబడి ఉన్న దుర్యోధనాదులను చూసి కృష్ణుడితో ఈ విధంగా అన్నాడు.'

అర్జున ఉవాచ ।
సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత ॥21॥
యావదేతాన్నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ ।
కైర్మయా సహ యోద్ధవ్యమస్మిన్రణసముద్యమే ॥22॥
యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః ।
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః ॥23॥

అర్జునః ఉవాచ సేనయోః ఉభయోః మధ్యే రథం స్థాపయ మే అచ్యుత యావత్ ఏతాన్ నిరీక్షే అహం యోద్ధుకామాన్ అవస్థితాన్ కైః మయా సహ యోద్ధవ్యం అస్మిన్ రణసముద్యమే యోత్స్యమానాన్ అవేక్షే అహం యే ఏతే అత్ర సమాగతాః ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః

అర్జునః = అర్జునుడు; ఉవాచ = అన్నాడు; అచ్యుత = అచ్యుత; ఉభయోః = రెండు; సేనయోః = సేనల; మధ్యే = మధ్యలో; మే = నా; రథం = రథం; స్థాపయ = నిలుపు; ఏతాన్ = ఈ; యావత్ యోద్ధుకామాన్ = యుద్ధంచేయాలన్న కోరికతో; అవస్థితాన్ = నిలబడ్డవారిని; అస్మిన్ = ఈ; రణసముద్యమే = యుద్ధంలో; మయా = నాచేత; కైః = ఎవరితో; సహ = కలిసి; యోద్ధవ్యం = యుద్ధం చేయవలసి ఉన్నదో; అహం = నేను; నిరీక్షే = చూస్తాను; యే = ఎవరైతే; ఏతే = వీళ్ళు; యుద్ధే = యుద్ధంలో; దుర్బుద్ధేః = దుర్బుద్ధి కలిగిన; ధార్తరాష్ట్రస్య = ధృతరాష్ట్రుడి పుత్రుడైన దుర్యోధనుడికి; ప్రియచికీర్షవః = ప్రియం చేయాలన్న కోరికతో ఉన్నవాళ్ళు ; అత్ర = ఇక్కడ; సమాగతాః = సమావేశమైనవాళ్ళు; యోత్స్యమానాన్ = యుద్ధం చేయబోతూ ఉన్నవారిని; అహం = నేను; అవేక్షే = చూస్తాను.

అర్జునుడు కృష్ణుడితో ఈ విధంగా అన్నాడు, 'కృష్ణ, నా రథాన్ని ఈ రెండు సేనల మధ్యలో నిలుపు. యుద్ధకాఙ్క్షతో వచ్చిన వాళ్ళెవరో, నేను ఎవరితో యుద్ధం చేయవలసి ఉన్నదో చూసుకుంటాను. ఈ యుద్ధంలో దుర్బుద్ధికలిగిన దుర్యోధనుడికి ప్రియం కలిగించాలన్న కోరికతో వచ్చి ఎదురుగా నిలబడ్డ వారిని చూస్తాను.'

సంజయ ఉవాచ ।
ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥24॥
భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతాన్సమవేతాన్కురూనితి ॥25॥

సంజయః ఉవాచ ఏవం ఉక్తః హృషీకేశః గుడాకేశేన భారత సేనయోః ఉభయోః మధ్యే స్థాపయిత్వా రథోత్తమం
భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితాం ఉవాచ 'పార్థ పశ్య ఏతాన్ సమవేతాన్ కురూన్' ఇతి

సంజయః = సంజయుడు; ఉవాచ = చెప్పాడు; భారత = ఓ భారత; ఏవం = ఈ విధంగా; గుడాకేశేన = అర్జునుడి చేత; ఉక్తః = చెప్పబడినవాడై; హృషీకేశః = హృషీకేశుడు; రథోత్తమం = ఉత్తమమైన రథాన్ని; ఉభయోః = రెండు; సేనయోః = సైన్యాల; మధ్యే = మధ్యలో; భీష్మద్రోణప్రముఖతః = భీష్మద్రోణులకు ఎదురుగా; చ = అలాగే; సర్వేషాం = అందరు; మహీక్షితాం = రాజుల (ఎదురుగా); స్థాపయిత్వా = నిలిపి; ఉవాచ = అన్నాడు; పార్థ = పార్థ; సమవేతాన్ = సమాశమైన; ఏతాన్ = ఈ; కురూన్ = కౌరవులను; పశ్య = చూడు; ఇతి = అని.

సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడు, 'రాజా, ఈ విధంగా అర్జునుడి చేత అడుగబడినవాడై కృష్ణుడు ఆ రథాన్ని తీసుకుని వెళ్ళి రెండు సైన్యాల మధ్యలో భీష్మద్రోణాది రాజులందరి ముందు నిలిపి అర్జునుడితో ఈ విధంగా అన్నాడు, 'అర్జున, యుద్ధం కోరి కూడి వచ్చిన ఈ కౌరవులందర్నీ చూడు.'

తత్రాపశ్యత్స్థితాన్పార్థః పితౄనథ పితామహాన్ ।
ఆచార్యాన్మాతులాన్భ్రాతౄన్పుత్రాన్పౌత్రాన్సఖీంస్తథా ॥26॥
శ్వశురాన్సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।
తాన్సమీక్ష్య స కౌన్తేయః సర్వాన్బన్ధూనవస్థితాన్ ॥27॥
కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।

తత్ర అపశ్యత్ స్థితాన్ పార్థః పితౄన్ అథ పితామహాన్ ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీన్ తథా
శ్వశురాన్ సుహృదః చ ఏవ సేనయోః ఉభయోః అపి తాన్ సమీక్ష్య సః కౌన్తేయః సర్వాన్ బన్ధూన్ అవస్థితాన్
కృపయా పరయా ఆవిష్టో విషీదన్ ఇదం అబ్రవీత్

అథ = అప్పుడు; పార్థః = అర్జునుడు; తత్ర = అక్కడ; స్థితాన్ = నిలచి ఉన్న; పితౄన్ = తండ్రులను; పితామహాన్ = తాతలను; ఆచార్యాన్ = ఆచార్యులను; మాతులాన్ = మేమమామలను; భ్రాతౄన్ = సోదరులను; పుత్రాన్ = పుత్రులను; పౌత్రాన్ = మనుమలను; సఖీన్ = స్నేహితులను; తథా = అలాగే; శ్వశురాన్ = మామలను; సుహృదః చ ఏవ = సుహృత్తులను కూడా; అపశ్యత్ = చూసాడు; సః = ఆ; కౌన్తేయః = అర్జునుడు; ఉభయోః = రెండు; సేనయోః అపి = సేనల్లోనూ; అవస్థితాన్ = నిలిచి ఉన్న; తాన్ = వారిని; బన్ధూన్ = బంధువులను; సర్వాన్ = అందరిని; సమీక్ష్య = చూసి; పరయా = పరమ; కృపయా = దయచేత; ఆవిష్టః = ఆవేశింపబడిన వాడై; విషీదన్ = విషాదం పొందుతూ; ఇదం = ఇది; అబ్రవీత్ = అన్నాడు.

అప్పుడు అర్జునుడు అక్కడ యుద్ధం చేయడానికి నిలబడి ఉన్న తండ్రులను, తాతలను, ఆచార్యులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, స్నేహితులను, మామలను, సుహృత్తులను చూసాడు. రెండు వైపులా ఉండి యుద్ధం చేయబోతున్నవారందరూ తనవారే. ఎటువైపున ఉండి యుద్ధం చేస్తున్నా కూడా ఈ యుద్ధం జరిగితే మరణించేది తనవారే అని చూడగానే అర్జునుడిలో గొప్ప దైన్యం ఆవేశించింది. ఆయనలో చాలా విషాదం కలిగింది. దానితో కృష్ణుడితో ఇలా అంటున్నాడు.

ఇక్కడ అర్జునుడిలో నా వాళ్ళు అన్న మమకారం పైకి లేచింది. వారికి మరణం సంభవిస్తుందన్న భయంతో మోహం ఆవహించింది. దానితో శోకం పెరిగింది. శోకం పొందిన వాడు శూద్రుడు (శుచమభిదుద్రావ శుచా వాభిదుద్రువే ఇతి). అటువంటివారిలో జ్ఞానం నిలువదు. అందుకని అజ్ఞానంలోకి జారిపోయాడు. మోహం వల్ల ధర్మాధర్మవివేకం నశించి ధర్మంలోనుండి కూడా జారిపోయాడు. అందుకనే అర్జునుడికి భగవంతుడు ఆత్మజ్ఞానంతో స్వధర్మం నేర్పించవలసి వచ్చింది.

అర్జున ఉవాచ ।
దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥28॥
సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥29॥
గాణ్డీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే ।
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥30॥

అర్జునః ఉవాచ 'దృష్ట్వా ఇమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితం సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి వేపథుః చ శరీరే మే రోమహర్షః చ జాయతే గాణ్డీవం స్రంసతే హస్తాత్ త్వక్ చ ఏవ పరిదహ్యతే న చ శక్నోమి అవస్థాతుం భ్రమతి ఇవ చ మే మనః'

అర్జునః = అర్జునుడు; ఉవాచ = చెప్పాడు; కృష్ణ = కృష్ణ; యుయుత్సుం = యుద్ధం చేయాలన్న కోరికతో; సముపస్థితం = వచ్చి నిలబడ్డ; ఇమం = ఈ; స్వజనం = స్వజనులను; దృష్ట్వా = చూస్తూనే; మమ = నా; గాత్రాణి = ఇంద్రియాలు; సీదన్తి = శిథిలమైపోతున్నాయి; చ = అలాగే; ముఖం చ = నోరు కూడా; పరిశుష్యతి = ఎండిపోతున్నది; మే = నా; శరీరే = శరీరంలో; వేపథుః చ = వణుకులు కూడా (కలుగుతున్నాయి); రోమహర్షః చ = గగుర్పాటు కూడా; జాయతే = కలుగుతున్నది; హస్తాత్ = చేతిలో నుండి; గాణ్డీవం = గాణ్డీవం; స్రంసతే = జారిపోతున్నది; త్వక్ చ ఏవ = దేహం కూడా; పరిదహ్యతే = దహించుకుని పోతున్నది; అవస్థాతుం చ = నిలబడడానికి కూడా; న శక్నోమి = శక్తి లేకుండా ఉన్నాను; మే = నా; మనః చ = మనసు కూడా; భ్రమతి ఇవ చ = భ్రమపడుతున్నట్టుగా ఉన్నది.

అర్జునుడు యుద్ధంలో రెండు వైపులా నిలబడ్డ తనవారిని చూడగానే ఈ యుద్ధం జరిగితే వారు చనిపోతారన్న భయం వల్ల కలిగిన శోకంతో కృష్ణుడితో ఈ విధంగా చెప్తున్నాడు, 'కృష్ణ, యుద్ధం చేయడానికి వచ్చి నిల్చున్న నా వారిని చూడగానే నా అవయవాలు బలహీనమైపోతున్నాయి. నా నోరు ఎండిపోతున్నది. నా శరీరం వణికిపోతున్నది, ఒళ్ళు గగుర్పొడుస్తున్నది. నా చేతిలోనుండి గాణ్డీవం జారిపోతున్నది. ఒళ్ళంతా రగిలిపోతున్నట్టుగా వేడెక్కుతున్నది. నిలబడలేకుండా ఉన్నాను. నా మనసు కూడా పరిభ్రమిస్తున్నది.'

ఇక్కడ ఇవన్నీ శోకమోహాలతో ఉన్నవారిలో కనిపించే శారీరక, మానసిక దుర్బలత్వాలను సూచించే చిహ్నాలు. శోకమోహాలను గుర్తించడానికి వీలుగా మనకు వీటిని చూపిస్తున్నారు వ్యాసులవారు. శోకమోహాలు లేనివారు శాంతంగా, స్థిరంగా ఉంటారు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥31॥

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ న చ శ్రేయః అనుపశ్యామి హత్వా స్వజనం ఆహవే

కేశవ = కేశవ; విపరీతాని = అశుభ; నిమిత్తాని చ = శకునాలు కూడా; పశ్యామి = చూస్తున్నాను; ఆహవే = యుద్ధంలో; స్వజనం = నా వారిని; హత్వా = చంపి; శ్రేయః చ = శ్రేయస్సును కూడా; న అనుపశ్యామి = చూడకున్నాను.

కృష్ణ, అపశకునాలు కూడా కనిపిస్తున్నాయి. ఈ యుద్ధంలో నా వారిని చంపడం వల్ల కలిగే మంచి కూడా కనిపించడం లేదు.

ఇక్కడ అర్జునుడికి యుద్ధం హింసాలక్షణంతో కూడి ఉంటుంది, చంపడమో, చావడమో తప్పదు అని తెలియని విషయం కాదు. అయితే మమకారం వల్ల కలిగిన మోహం చేత జ్ఞానం నశించి తనవారి కోసం శోకిస్తున్నాడు. అందుకనే భగవంతుడు, 'గతాసూనగతా–సూంశ్చ నానుశోచన్తి పణ్డితాః' అని మొదలుపెడుతూ ఆత్మజ్ఞానోపదేశం చేయబోతూ ఉన్నారు.

న కాఙ్క్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగైర్జీవితేన వా ॥32॥

న కాఙ్క్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ కిం నః రాజ్యేన గోవిన్ద కిం భోగైః జీవితేన వా

కృష్ణ = కృష్ణ; విజయం = విజయం; న కాఙ్క్షే = కోరుకోవడంలేదు; రాజ్యం చ = రాజ్యం కూడా; సుఖాని చ = సుఖాలు కూడా; న = (కోరుకోవడం) లేదు; గోవిన్ద = గోవింద; నః = మాకు; రాజ్యేన = రాజ్యంతో; కిం = ఏం పని; భోగైః = భోగాలతో; జీవితేన వా = జీవితంతోనైనా; కిం = ఏం పని.

కృష్ణ, నావారిని చంపడం వల్ల కలిగే విజయం నేను కోరుకోవట్లేదు. ఆ విధంగా వచ్చిన రాజ్యభోగాలు, సుఖాలు కూడా కోరట్లేదు. మావారిని చంపుకున్న తర్వాత మాకు ఇక ఈ రాజ్యంతో, ఈ రాజ్యభోగాలతో ఏం పని? మేమిక బ్రతికి ఉండడం ఎందుకు?

ఇక్కడ అర్జునుడు జరుగుతున్న యుద్ధం ధర్మంకోసం అన్న విషయం మర్చిపోయి కోరికలు, భోగాలు, సుఖాలు, రాజ్యం అని అర్థకామాల గురించి మాత్రమే మాట్లాడుతున్నాడు. రామాయణంలో రామచన్ద్రమూర్తి లక్ష్మణుడికి చేసిన ఉపదేశం ఇక్కడ జ్ఞాపకం చేసుకోవలసి ఉన్నది. 'చేస్తున్న కర్మలో ధర్మార్థకామాలు మూడూ కలసివస్తే మంచిది. ఒకవేళ అర్థకామాలు కూడి రాకపోతే వాటిని వదిలిపెట్టి ధర్మాన్ని పట్టుకోవలసి ఉంటుంది. అంతేకానీ అర్థకామాలకోసం ధర్మం వదిలిపెట్టుకోరాదు. అర్థం పట్టుకున్నవాడిని అర్థపరుడని, కామం పట్టుకున్నవాడిని కామాత్ముడని అంటారు. ధర్మం పట్టుకున్నవాడిని ధర్మాత్ముడని అంటారు' అని చెప్పారు. అక్కడ రామచన్ద్రమూర్తి చూపించిన ధర్మాచరణను ఇక్కడ కృష్ణులవారు చెప్పి నేర్పించబోతున్నారు.

యేషామర్థే కాఙ్క్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ ॥33॥
ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబన్ధినస్తథా ॥34॥

యేషాం అర్థే కాఙ్క్షితం నః రాజ్యం భోగాః సుఖాని చ తే ఇమే అవస్థితాః యుద్ధే ప్రాణాన్ త్యక్త్వా ధనాని చ ఆచార్యాః పితరః పుత్రాః తథా ఏవ చ పితామహాః మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబన్ధినః తథా

నః = మావాళ్ళు; యేషాం = ఎవరి; అర్థే = కోసమైతే; రాజ్యం = రాజ్యం; భోగాః = భోగాలు; సుఖాని చ = సుఖాలు కూడా; కాఙ్క్షితం = కోరుకోవడం జరిగిందో; తే = ఆ; ఇమే = వీళ్ళే; ఆచార్యాః = ఆచార్యులు; పితరః = తండ్రులు; పుత్రాః = పుత్రులు; తథా ఏవ చ = అలాగే;

పితామహాః = తాతలు; మాతులాః = మేనమామలు; శ్వశురాః = మామలు; పౌత్రాః = మనుమలు; శ్యాలాః = బావలు; తథా = అలాగే; సంబన్ధినః = సంబంధీకులందరూ; యుద్ధే = యుద్ధంలో; ప్రాణాన్ = ప్రాణాలను; ధనాని చ = ధన్నాన్ని కూడా; త్యక్త్వా = వదిలి; అవస్థితాః = నిలబడి ఉన్నారు.

మేము ఎవరికోసమైతే ఈ రాజ్యభోగాలు, సుఖాలు కావాలని ఆశించామో అటువంటి మా ఆచార్యులు, తండ్రులు, పుత్రులు, తాతలు, మేనమామలు, మామలు, మనుమలు, బావలు అందరూ మా బంధువులే. వాళ్ళందరూ ఇప్పుడు ప్రాణాలపైన, ధనాలపైన ఆశలు వదిలిపెట్టి, అన్నీ పోగొట్టుకోవడానికి సిద్ధపడి యుద్ధానికి వచ్చి నిలబడి ఉన్నారు.

ఇక్కడ అర్జునుడు నా తాతలు, తండ్రులు అంటున్న వారందరూ భగవంతుడుకి, భగవంతుడు చూపించిన మార్గానికి వ్యతిరేకంగా అధర్మంవైపున నిలబడి ఉన్నారు. అర్జునుడు చేస్తున్న యుద్ధం వారితో కాదు. వారి రూపంలో ఉన్న అధర్మంతో. అధర్మాన్ని ఆశ్రయించి ధర్మాన్ని నశింపచేయడానికి ధనప్రాణాలను పోగొట్టుకోవడానికి సిద్ధపడి వచ్చిన వారిని నావారు అంటూ, వారికోసం రాజ్యభోగాలను, సుఖాలను కోరుకోవడం అధర్మాన్ని నిలబెట్టాలని కోరుకోవడం అవుతుంది. అర్జునుడు ఇది చూసుకోవడం లేదు.

ఏతాన్న హన్తుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥35॥

ఏతాన్ న హన్తుం ఇచ్ఛామి ఘ్నతః అపి మధుసూదన అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే

మధుసూదన = మధుసూదన; ఘ్నతః అపి = నేను నశించినా సరే; త్రైలోక్యరాజ్యస్య = ముల్లోకాల రాజ్యం; హేతోః అపి = కారణానికైనా సరే; ఏతాన్ = వీరిని; హన్తుం = చంపడానికి; న ఇచ్ఛామి = కోరుకోను; మహీకృతే = భూమికోసం; కిం ను = ఇక ఎందుకు?

కృష్ణ, వీరిని చంపకపోతే నేను చనిపోతానన్నా సరే, వీరిని చంపితే నాకు ముల్లోకాధిపత్యం వస్తుందన్నా సరే నా వారిని చంపడానికి నేను ఇష్టపడను. అటువంటిది కేవలం కొద్దిపాటి భూమి కోసం నా వారిని చంపుకుంటానా?

ఇక్కడ అర్జునుడు జరుగబోతున్న యుద్ధం ప్రాణాలు నిలబెట్టుకోవడానికో, ముల్లోకాలు సాధించడానికో, రాజ్యభోగాలు అనుభవించ-డానికో కాదు, అధర్మాన్ని తొలగించి, ధర్మాన్ని స్థాపించడం కోసం అన్న ఆలోచన చేయడం లేదు.

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన ।
పాపమేవాశ్రయేదస్మాన్హత్వైతానాతతాయినః ॥36॥

నిహత్య ధార్తరాష్ట్రాన్ నః కా ప్రీతిః స్యాత్ జనార్దన పాపమేవ ఆశ్రయేత్ అస్మాన్ హత్వా ఏతాన్ ఆతతాయినః

జనార్దన = జనార్దన; ధార్తరాష్ట్రాన్ = ధార్తరాష్ట్రులను; నిహత్య = చంపితే; నః = మాకు; కా = ఏమి; ప్రీతిః = ప్రీతి; స్యాత్ = ఉంటుంది; ఆతతాయినః = చంపబోతున్న; ఏతాన్ = వీరిని; హత్వా = చంపి; అస్మాన్ = మమ్మల్ని; పాపం ఏవ = పాపమే; ఆశ్రయేత్ = ఆశ్రయిస్తుంది.

కృష్ణ, దుర్యోధనాదులను చంపడం వల్ల మాకేమి సంతోషం కలుగుతుంది? మమ్మల్ని చంపడానికి ఉద్యుక్తులౌతున్న వీరిని చంపడం వల్ల మాకు పాపమే కలుగుతుంది.

ఇక్కడ అర్జునుడికి దుర్యోధనాదులు ఆతతాయులు, చంపడానికి పూనుకున్నవారు అని తెలుసు. అయినా కూడా వారిని చంపడం వల్ల ప్రీతి కలుగదని, చంపితే పాపం వస్తుందని అనుకుంటున్నాడు. ధర్మానికి హాని కలిగించేవారిని నిగ్రహించడం కేవలం ధర్మంకోసమే అయి ఉండాలి. ఇటువంటి ధర్మయుద్ధం చేయకపోవడం వల్ల పాపం కలుగుతుందని, 'ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి, తతః పాపమవాప్స్యసి' అని చెప్తారు.

తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్స్వబాన్ధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥37॥

తస్మాత్ న అర్హాః వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాన్ధవాన్ స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ

మాధవ = మాధవ; తస్మాత్ = కాబట్టి; వయం = మేము; స్వబాన్ధవాన్ = స్వంత బంధువులను; ధార్తరాష్ట్రాన్ = ధార్తరాష్ట్రులను; హన్తుం = చంపడానికి; న అర్హాః = అర్హులము కాదు; స్వజనం = స్వజనులను; హత్వా = చంపి; కథం = ఏ విధంగా; సుఖినః = సుఖంగా; స్యామ హి = ఉండగలము.

కృష్ణ, కాబట్టి మా బంధువులైన దుర్యోధనాదులను మేము చంపతగదు. మా వారిని చంపితే మేమెలా సుఖంగా ఉండగలము?

ఇక్కడ అర్జునుడు చెప్తున్నది కొంతవరకే సత్యం. బంధువులను చంపడం తగినపని కాదు. అవును నిజమే. స్వజనులను చంపి ఎవరూ సుఖంగా ఉండలేరు. అయితే ఇతరులను చంపడం తగినపనేనా? స్వజనులు కానివారిని చంపి రాజ్యాలు సాధించి భోగాలు అనుభవిస్తూ సుఖంగా ఉండతగునా? ఈ విధంగా తనపరభేదాలతో మారిపోయే ధర్మం ధర్మమేనా? పైగా ఇంతవరకు వీరు నా శత్రువులు అనుకుంటూ చంపడానికే యుద్ధానికి వచ్చి ఇప్పుడు అకస్మాత్తుగా నావారు, చంపలేను, యుద్ధం మానుకుంటాను అంటూ ఉంటే భగవంతుడు 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అని చెప్పబోతున్నారు.

యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥38॥
కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥39॥
కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః ।
ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మోఽభిభవత్యుత ॥40॥
అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః ।
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥41॥
సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।
పతన్తి పితరో హ్యేషాం లుప్తపిణ్డోదకక్రియాః ॥42॥
దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।

ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥43॥

ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।

నరకేఽనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ ॥44॥

యది అపి ఏతే న పశ్యన్తి లోభోపహతచేతసః కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకం కథం న జ్ఞేయం అస్మాభిః పాపాత్ అస్మాత్ నివర్తితుం కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిః జనార్దన కులక్షయే ప్రణశ్యన్తి కులధర్మాః సనాతనాః ధర్మే నష్టే కులం కృత్స్నం అధర్మః అభిభవతి ఉత అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యన్తి కులస్త్రియః స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః సంకరః నరకాయ ఏవ కులఘ్నానాం కులస్య చ పతన్తి పితరః హి ఏషాం లుప్తపిణ్డోదకక్రియాః దోషైః ఏతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ఉత్సాద్యన్తే జాతిధర్మాః కులధర్మాః చ శాశ్వతాః ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన నరకే అనియతం వాసః భవతి ఇతి అనుశుశ్రుమ

జనార్దన = జనార్దన; యది అపి = ఒకవేళ; లోభోపహతచేతసః = లోభితనంతో దెబ్బతిన్న మనసులతో ఉన్న; ఏతే = వీళ్ళు; కులక్షయకృతం = కులక్షయం వల్ల కలిగే; దోషం = దోషాన్ని; మిత్రద్రోహే = మిత్రద్రోహం వల్ల కలిగే; పాతకం చ = పాపాన్ని కూడా; న పశ్యన్తి = చూడలేకపోతే; కులక్షయకృతం = కులక్షయం వల్ల కలిగే; దోషం = దోషం; ప్రపశ్యద్భిః = చూడగలుగుతున్న; అస్మాభిః = మనచేత; జ్ఞేయం = తెలిసి ఉన్న; అస్మాత్ = ఈ; పాపాత్ = పాపం నుండి; కథం = ఎందుకని; న నివర్తితుం = వెనక్కు తిరుగరాదు; కృష్ణ = కృష్ణ; కులక్షయే = కులక్షయం కలిగితే; సనాతనాః = సనాతనమైన; కులధర్మాః = కులధర్మాలు; ప్రణశ్యన్తి = (ప్ర నశ్యన్తి) పూర్తిగా నశించిపోతాయి; ధర్మే = ధర్మం; నష్టే = నశిస్తే; కులం = కులం; కృత్స్నం = మొత్తం; అధర్మః = అధర్మం; అభిభవతి ఉత = పెరిగిపోతుంది కదా; అధర్మాభిభవాత్ = అధర్మం పెరిగిపోవడంవల్ల; కులస్త్రియః = కులస్త్రీలు; ప్రదుష్యన్తి = (ప్ర దుష్యన్తి) దుష్టులౌతారు; వార్ష్ణేయ = వృష్ణి వంశంలో పుట్టినవాడా కృష్ణ; స్త్రీషు = స్త్రీలు; దుష్టాసు = దుష్టులైతే; వర్ణసంకరః = వర్ణసంకరం; జాయతే = కలుగుతుంది; సంకరః = సంకరం; కులఘ్నానాం = కులాన్ని నశింపచేసినవారి యొక్క; నరకాయ ఏవ = నరకానికే (కారణం అవుతుంది); లుప్తపిణ్డోదకక్రియాః = పిండోదకక్రియలు లుప్తమై; ఏషాం = వీరి; కులస్య = కులం యొక్క; పితరః చ = పితరులు కూడా; పతన్తి హి = పతనమైపోతారు; వర్ణసంకరకారకైః = వర్ణసంకరకారకమైన; ఏతైః = ఈ; దోషైః = దోషాలవల్ల; కులఘ్నానాం = కులనాశనం చేసినవారి; శాశ్వతాః = శాశ్వతమైన; జాతిధర్మాః = జాతిధర్మాలు; కులధర్మాః చ = కులధర్మాలు కూడా; ఉత్సాద్యన్తే = పెళ్ళగించబడతాయి; జనార్దన = జనార్దన; ఉత్సన్నకులధర్మాణాం = కులధర్మాలు నశింపచేసిన; మనుష్యాణాం = మనుషులకు; నరకే = నరకంలో; వాసః = నివాసం; అనియతం = అనంతకాలం (లేదా నియతం = తప్పనిసరిగా) భవతి = కలుగుతుంది; ఇతి = అని; అనుశుశ్రుమ = వింటుంటాము.

కృష్ణ, ఒకవేళ లోభితనంతో వీళ్ళు కులనాశం, మిత్రద్రోహం వల్ల కలిగే దోషాలను చూడలేకపోతే పోనీ, చూడగలిగినవాళ్ళం తెలిసినవాళ్ళం మనం ఎందుకు ఇటువంటి పాపం నుండి ప్రక్కకు తప్పుకోరాదు? కులం నశిస్తే సనాతనమైన కులధర్మాలు నశిస్తాయి. ధర్మం నశిస్తే అధర్మం పెరిగిపోతుంది. అధర్మం పెరిగితే కులస్త్రీలు దుష్టులౌతారు. స్త్రీలు దుష్టులైతే వర్ణసంకరం కలుగుతుంది. వర్ణసంకరం కలిగితే అలా చేసినవారికి అది నరకకారణం అవుతుంది. అటువంటి వారి కులంలో పితృతర్పణాలులేక పితరులు పతనమైపోతారు. దీనివల్ల జాతిధర్మాలు, కులధర్మాలు కూకటివేళ్ళతో సహా పెకిలించబడతాయి. కులజాతిధర్మాలు నశిస్తే దానికికారణమైన వారికి తప్పకుండా అనంతకాలం నరకవాసం ఉంటుందని చెప్తుంటే వింటుంటాము.

ఇక్కడ అర్జునుడు లోకంలో అక్కడక్కడా వినబడే ప్రచలితాల గురించి చెప్తున్నాడు. వేదోక్తమైన విషయాలకు విపరీతవ్యాఖ్యానాలు చేసి ఉన్నది ఇదే అని చెప్పబడుతున్న ఇటువంటి వాదనలను కూడా భగవంతుడు 'యామిమాం పుష్పితాం వాచమ్' అని ఖండించబోతున్నారు.

ఒక కులం కానీ జాతి కానీ నశించినంతమాత్రాన ధర్మం నశించిపోదు. దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని ఆచరించేవారు లేనప్పుడు మాత్రమే ధర్మం మరుగునపడిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో 'యదాయదా హి ధర్మస్య గ్లానిర్భవతి' దాన్ని తిరిగి స్థాపించడానికి నేనున్నాను అని చెప్పబోతున్నారు.

అర్జునుడి మాటల్లో ఆయనకు వర్ణసంకరం గురించి సరియైన అవగాహన లేదని తెలుస్తున్నది. మగవారు యుద్ధాలు చేసుకుని మరణించినంతమాత్రాన ధర్మం నశించి అధర్మం పెరిగి స్త్రీలు దుష్టులు అవ్వడం, అందువల్ల వర్ణసంకరం జరుగడం ఉండదు. వర్ణసంకరమంటే అది కాదు. అందుకనే భగవంతుడు 'చాతుర్వర్ణ్యం మయా సృష్టమ్', 'న కుర్యాం కర్మ చేదహం సంకరస్య చ కర్తా స్యామ్' నేనైనాసరే, ఎవరైనాసరే వారివారి కర్మలను వారు ధర్మంగా నిర్వర్తించకపోతే వర్ణసంకరానికి కారణమవుతారు అని వర్ణసంకరానికి కారణం వివరించబోతున్నారు. మగవారు అర్థకామాలకోసం యుద్ధాలు చేసుకుని సామూహికంగా నశించిపోతే, స్త్రీలు ధర్మంగా కులాలను నిలబెడుతూ వచ్చారు, ఇది ధర్మం అని ఇదే భారతంలో వ్యాసులవారు చూపిస్తూ వచ్చారు.

అర్జునుడి మాటల్లో ఆయనకు పితృతర్పణాల గురించి కూడా సరైన అవగాహన లేనట్టుగా కనబడుతున్నది. మనుధర్మశాస్త్రంలో మూడో అధ్యాయంలో పఞ్చయజ్ఞాల గురించి వివరిస్తున్న ప్రకరణంలో పితరులంటే ఇంట్లో ఉన్న పెద్దలకు గృహస్థు తన ధర్మంగా 'పయోమూల–ఫలైర్వాఽపి పితృభ్యః ప్రీతిమావహన్' చేసే సేవలను పితృతర్పణం, శ్రాద్ధం అంటారు అని చెప్పారు. ఇదే విషయం వ్యాసులవారు అరణ్యపర్వలో యుధిష్ఠిరశౌనకసంవాదంలో యుధిష్ఠిరుడిచేత కూడా చెప్పించారు.

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనముద్యతాః ॥45॥

అహో బత మహత్ పాపం కర్తుం వ్యవసితాః వయం యత్ రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనం ఉద్యతాః

అహో బత = అయ్యో; వయం = మేము; రాజ్యసుఖలోభేన = రాజ్యసుఖాలు కావాలన్న లోభితనంతో; యత్ = ఏదైతే; స్వజనం = స్వజనులను; హన్తుం = చంపుకోవడానికి; ఉద్యతాః = ఉద్యమించినవారమై; మహత్ = గొప్ప; పాపం = పాపం; కర్తుం = చేయడానికి; వ్యవసితాః = పూనుకున్నాము.

అయ్యో, రాజ్యభోగాలు అనుభవించాలన్న లోభితనంతో స్వంత బంధువులను చంపుకోవడానికి ఉద్యుక్తులమైయ్యామే. ఎటువంటి పాపం చేయడానికి ఉద్యమించాము.

ఇక్కడ అర్జునుడు నేను, నావారు అన్న అహంకారమమకారాలతో మాట్లాడుతున్నాడు. ఆయనకిప్పుడు భగవంతుడు ఆత్మధర్మాన్ని ఉపదేశం చేయవలసి ఉన్నది.

యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమతరం భవేత్ ॥46॥

యది మాం అప్రతీకారం అశస్త్రం శస్త్రపాణయః ధార్తరాష్ట్రాః రణే హన్యుః తత్ మే క్షేమతరం భవేత్

యది = ఒకవేళ; రణే = యుద్ధంలో; అప్రతీకారం = ఎదుర్కోకుండా; అశస్త్రం = శస్త్రాలు వాడకుండా ఉన్న; మాం = నన్ను; శస్త్రపాణయః = శస్త్రాలు చేతిలో ధరించినవారై; ధార్తరాష్ట్రాః = ధార్తరాష్ట్రులు; హన్యుః = చంపితే; తత్ = అది; మే = నాకు; క్షేమతరం = క్షేమం; భవేత్ = కాగలదు.

ఒకవేళ యుద్ధంలో ఎదురుతిరిగి పోరాడకుండా శస్త్రాలు పక్కనపెట్టి ఉన్న నన్ను ఆయుధాలతో వచ్చి దుర్యోధనాదులు చంపితే అదే నాకు క్షేమం అవుతుంది.

ఇక్కడ అర్జునుడు చెప్తున్న క్షేమం క్షేమం కాదు. చావుతో సమస్య తీరదు. మోక్షమే క్షేమం. అందుకనే ఇక భగవంతుడు ఆత్మజ్ఞానోప-దేశం మొదలుబెట్టబోతూ ఉన్నారు.

సంజయ ఉవాచ ।

ఏవముక్త్వార్జునః సఙ్ఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।

విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥47॥

సంజయః ఉవాచ ఏవం ఉక్త్వా అర్జునః సఙ్ఖ్యే రథోపస్థే ఉపావిశత్ విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః

సంజయః = సంజయుడు; ఉవాచ = చెప్పాడు; ఏవం = ఈ విధంగా; ఉక్త్వా = చెప్పి; శోకసంవిగ్నమానసః = శోకంతో చెదిరిపోతున్న మనసుతో ఉన్న; అర్జునః = అర్జునుడు; సఙ్ఖ్యే = యుద్ధంలో; సశరం = బాణంతో పాటు; చాపం = ధనుస్సును; విసృజ్య = వదిలిపెట్టి; రథోపస్థే = (రథ ఉపస్థే) రథం పైన ; ఉపావిశత్ = కూర్చుండి పోయాడు.

సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్తున్నాడు, ‘ఈ విధంగా కృష్ణుడితో చెప్పి శోకంచేత కలతచెందిన మనసుతో ఉన్న అర్జునుడు ఆ యుద్ధంలో ఎక్కుపెట్టిన ధనుర్బాణాలను వదిలేసి, రథంలో కూలబడిపోయాడు.

ఇతి మహాభారతే గీతాశాస్త్రే కృష్ణార్జునసంవాదే ప్రథమోఽధ్యాయః ॥